సాక్షి నల్లగొండ

గురువారం । 20 । జూలై । 2023



ఆవిష్కరణలకు ఆహ్వానం
ప్రతిభ ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏటా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. - 8లో



మోసం చేసిన మోదీ
ప్రధాని నరేంద్ర మోదీ నిరుద్యోగులను మోసం చేశారని ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. - 10లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 30° / 25°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బెస్ట్ అవైలబుల్ డ్రా

నల్లగొండ : బెస్ట్ అవైలబుల్ స్కీం కింద షెడ్యూల్డ్ కులాలకు చెందిన బాల, బాలకల పాఠశాలల్లో సీట్ల కేటాయింపునకు గురువారం డ్రా తీయనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీటీ మార్కెట్ పక్కన ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

28న పాలిసెట్ స్పాట్ కౌన్సిలింగ్

రామగిరి(నల్లగొండ) : పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ఈనెల 28న స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జానకీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించిన వారు, టెన్త్ ఉత్తీర్ణులైన వారు జూలై 25 నుంచి 27వరకు దరఖాస్తు చేసుకోవచ్చిన పేర్కొన్నారు. అడ్మిషన్లలో పాలిసెట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

రెడ్డికాలనీలో రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలించి మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ రూరల్ : మండలంలోని రెడ్డికాలనీ గ్రామ పంచాయతీ రికార్డులను బుధవారం అడిషనల్ కలెక్టర్ ఖుష్బూగుప్తా పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసే విషయంలో గ్రామంలో పనితీరును తెలుసుకున్నారు. ట్రాక్టర్ ఈఎంఐ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, రికార్డుల నిర్వహణ, హరితహారం, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింహారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామంలో ఇళ్ల గుర్తింపు



గుడితండాలో ఇంటి కొలతలు తీసుకుంటున్న అధికారులు

కొండమల్లేపల్లి : మండలంలోని పెండ్లిపాకల రిజర్వాయర్ సామర్థ్యం పెంపుతో ముంపునకు గురవుతున్న గుడితండాలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు భవనాల శాఖ అధికారులు బుధవారం ఇళ్లను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా ముంపునకు గురవుతున్న ఇళ్లకు సంబంధించి కొలతలు తీసుకున్నారు. తండాల్లో సుమారు 400 ఇళ్లు ఉన్నట్లు గుర్తించినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ సతీష్ కృష్ణ తెలిపారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నల్లగొండ టౌన్ : చేనేత కార్మికుల దగ్గర ఉన్న నిల్వలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి కార్మికులను ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాస్టర్ వీవర్స్, సహకార సంఘాల వద్ద ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే వస్త్రాలు సరైన మార్కెటింగ్ లేకపోవడం వల్ల పేరుకుపోయి కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత మిత్ర ద్వారా ఇస్తున్న యారన్ సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో వేయాలన్నారు. సమావేశంలో కందగట్ల గణేష్, కర్నాటి శ్రీరంగం, రావిరాల మారయ్య, రాపోలు వెంకన్న, గోశిక నరసయ్య, ఏలె శ్రీనివాస్ పాల్గొన్నారు.

21న మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

నల్లగొండ రూరల్ : నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 21న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020-21, 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు ఉద్యోగ మేళాకు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. పలు కంపెనీల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు టాస్క్ సమన్వయకర్త రాజు తెలిపారు.

ఒక్కటవుతున్నారు!

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో నాయకుల ఐక్యతా రాగం

- అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా అడుగులు
- మంత్రి జగదీష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో దూరాన్ని వీడిన ముఖ్యులు
- కాంగ్రెస్‌లో కీలకంగా మారిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- రెండు పార్టీల్లోనూ కిందిస్థాయిలో అవే లుకలుకలు



మంత్రి జగదీశ్‌రెడ్డిని కుటుంబ సమేతంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సుఖేందర్‌రెడ్డి (ఫైల్)



హైదరాబాద్‌లో ఎంపీ ఉత్తమ్‌ను సన్మానిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి, చిత్రంలో రేవంత్‌రెడ్డి, భట్టి

సాక్షి ప్రతినిధి నల్లగొండ: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని ముఖ్య నాయకులు ఏకమవుతున్నారు. మొన్నటి వరకు అంటీముట్టనట్టుగా ఉన్న నేతలు ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి తన పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం రాత్రి ఇచ్చిన విందుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు అంతా హాజరయ్యారు. ముఖ్యంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా.. తామంతా కలిసే ఉన్నామనే సంకేతాన్ని ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలోనూ నేతలు అదే ఐక్యతా రాగాన్ని అందుకున్నారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కీలకంగా మారారు. బుధవారం కోమటిరెడ్డి ఇంట్లో రాష్ట్ర నేతలు లంచ్ మీటింగ్‌కు హాజరై ఐక్యతను చాటారు.

ఇన్నాళ్లు ఎవరికి వారుగానే..

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాటి నుంచి జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన పెద్దగా కలిసి పాల్గొన్న సమావేశాలు లేవు. మంత్రి, గుత్తా మధ్య ఎలాంటి వివాదం లేకపోయినా పెద్దగా కలిసేవారు కాదు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటం.. ఇదే సమయంలో మంత్రి తన పుట్టిన రోజు వేడుకలకు రావాలని ఆహ్వానించడంతో గుత్తా కుటుంబ సమేతంగా హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో తామే గెలుస్తామని ఇప్పటికే చెబుతున్న నేతలు ఈ కలయిక ద్వారా తాము కలిసి పనిచేస్తామనే సంకేతాన్ని పార్టీ కేడర్‌కు పంపే ప్రయత్నం చేశారు. వచ్చే ఎన్నికల్లో గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి పోటీ చేయాలనే ఆలోచనతో కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి కలయికకు ప్రాధాన్యం ఏర్పడింది.

కాంగ్రెస్ పార్టీలోనూ ఒక్కటవుతున్న ముఖ్య నేతలు

కాంగ్రెస్ పార్టీలో నేతలు అంతా ఒక్కటవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాలను తాము గెలిచి తీరుతామన్న సంకేతాన్ని కేడర్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇదివరకే స్పష్టం చేసిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తామంతా కలిసే ఉన్నామనే విషయాన్ని రుజువు చేసే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో లంచ్ మీటింగ్ ఏర్పాటు చేయడం, ఆ మీటింగ్‌కు రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఇతర రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు. కోమటిరెడ్డి సూచన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అందులో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరుల తోపాటు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రంలోనూ పర్యటించడం ద్వారా పార్టీని గెలిపించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. మొత్తానికి ఈ భేటీ ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ఒక్క తాటిపైకి వచ్చారన్న సంకేతాలు ఇచ్చినట్లు అయ్యింది.

నియోజకవర్గ స్థాయిలో చెక్ పెట్టేదెలా..

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో కిందిస్థాయిలో మాత్రం లుకలుకలు అలాగే కొనసాగుతున్నాయి. కోదాడ, నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నియోజకవర్గ స్థాయి నాయకులు తమ ప్రయత్నాల్లో ఉన్నారు. పార్టీ టికెట్ ఇస్తే కోదాడలో కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, నాగార్జునసాగర్‌లో బుసిరెడ్డి పాండురంగారెడ్డి, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం రంజిత్ యాదవ్, మునుగోడులో గుత్తా అమిత్, నల్లగొండలో పిల్లి రామరాజు యాదవ్, చాడా కిషన్‌రెడ్డి, నకిరేకల్‌లో వేముల వీరేశం బీఆర్ఎస్ నుంచి పోటీచేసేందుకు సిద్ధమై తమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇందులో కొందరు తమకు అవకాశం ఇస్తే పోటీ చేస్తామంటుండగా, మరికొందరు సిట్టింగ్‌లకు ఇవ్వకుండా, తమకే టికెట్ ఇవ్వాలని కోరుతున్న వారు ఉన్నారు. మరోవైపు వేముల వీరేశం, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటారనే ప్రచారంపైనా బుధవారం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరోక్షంగా వివరణ ఇచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీకి అభ్యర్థులున్నారని, ఓవర్ లోడ్ అయిందని, ఇతర పార్టీల నుంచి చేరికలు అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలో కిందిస్థాయిలో నెలకొన్న అసమ్మతిని ఎలా చల్లార్చుతారు? టికెట్లు ఆశిస్తున్న వారిని ఎలా బుజ్జగిస్తారు? అన్నది ముఖ్య నేతలకు సవాల్ కానుంది.

హరితహారం లక్ష్యాన్ని చేరుకోవాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా తదితరులు

నల్లగొండ : అధికారులు సమన్వయంతో పనిచేసి హరితహారం లక్ష్యం చేరుకునేలా మొక్కలు నాటాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో హరితహారం, సంపద వనాలు, ప్రకృతివనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, ఇంటింటికీ మొక్కల పంపిణీ, నాటడం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటికీ మొక్కల పంపిణీ, నాటించే కార్యక్రమాన్ని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు ఫారెస్ట్, మున్సిపాలిటీ మొక్కల లక్ష్యం మినహా.. మిగతా అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటడానికి అవసరమైన నివేదికలు, రిపోర్టులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయి రిపోర్టులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయాలి



రైతు దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష రుణమాఫీని వడ్డీతో సహా తక్షణమే చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా రూ.లక్ష రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఉచిత ఎరువుల హామీని తక్షణమే అమలు చేయాలని, సబ్సిడీపై అన్ని రకాల వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత యాసంగిలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. రుణమాఫీపై స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి, చేపూరి రవీందర్, కంకణాల నివేదితరెడ్డి, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, కె.అశోక్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, దాసోజు యాదగిరాచారి, గుండా నవీన్‌కుమార్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్, పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఐతరాజు సిద్దు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక విడుదల



రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న విభవ్, అధికారులు

నల్లగొండ : జిల్లా వార్షిక రుణ ప్రణాళిక (2023 - 24)ను బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ విభవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం రుణ లక్ష్యం రూ.8,937 కోట్లు ఉండగా, ఇందులో పంట రుణాలు రూ.4,909.19కోట్లు, టర్మ్ లోన్లు రూ.2,266.22 కోట్లు, సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు రూ.821.64 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.438.31 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.501.65 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వివిధ రంగాలకు కేటాయించిన లక్ష్యాన్ని బ్యాంకర్లు సాధించాలని పేర్కొన్నారు. గత సంవత్సరం అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అనుబంధ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేదని.. ఈ సంవత్సరం అన్ని బ్యాంకులు ఈ లక్ష్యంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రామిక్, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్, మెప్మా పీడీ కరుణాకర్, డీఏఓ సుచరిత తదితరులు పాల్గొన్నారు.


ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండల్‌రావు

నల్లగొండ : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలచేత ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్‌లో విద్యార్థుల చేత అల్బెండజోల్ మాత్రను నమిలి మింగించాలని పేర్కొన్నారు. జిల్లాలోని 3,88,222 మంది పిల్లల కోసం 4,49,000 అల్బెండజోల్ మాత్రలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అబ్దుల్‌జమీర్ మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులతో శారీరక, మానసిక ఎదుగుదల మందగిస్తుందని, రక్తహీనత, చదువుపై శ్రద్ధ తగ్గడం, చిరాకు, మతిమరపు లాంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తులు



నల్లగొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీ పోస్టులకు ఆయా సబ్జెక్టుల వారీగా అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. అభ్యర్థులు ఆయా కళాశాలల వారీగా సబ్జెక్టులను బట్టి ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని డీఐఈఓ దస్రూనాయక్ పేర్కొన్నారు.

పాత వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి

జూనియర్ కళాశాలల్లో పది సంవత్సరాలుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను ప్రభుత్వం పక్కన పెట్టి కొత్త వారిని తీసుకోవాలని నిర్ణయించింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి తిరిగి అవకాశం కల్పించాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం నాయకుడు జలెందర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కళాశాలల వారీగా ఖాళీలు ఇలా..

- నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్, బోటని, ఫిజిక్స్, కామర్స్, జువాలజీ, జువాలజీ ఉర్దూ మీడియం, మ్యాథ్స్ (ఉర్దూ), ఉర్దూ.
- కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి బాలుర జూనియర్ కళాశాలలో కామర్స్, కెమిస్ట్రీ (ఉర్దూ), అదే కళాశాల ఒకేషనల్ విభాగంలో పీఎస్‌టీటీ.
- నకిరేకల్ జూనియర్ కళాశాలలో జువాలజీ.
- మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు, హిందీ, ఉర్దూ, ఎకనామిక్స్, హిస్టరీ ఉర్దూ, ఆర్థికశాస్త్రం (ఉర్దూ), కామర్స్, సివిక్స్ (ఉర్దూ).
- ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల దేవరకొండలో కామర్స్, మ్యాథ్స్, జువాలజీ, ఓఏ.
- దేవరకొండ బాలుర జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్, మ్యాథ్స్.
- చింతపల్లి డాక్టర్ ఏజేఆర్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ, ఫిజిక్స్, జువాలజీ.
- నాగార్జునసాగర్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ, ఇంగ్లిష్, హిస్టరీ, జువాలజీ, తెలుగు.
- హాలియా కళాశాలలో మ్యాథ్స్.
- నాంపల్లి జూనియర్ కళాశాలలో బోటని, కామర్స్, మ్యాథ్స్, ఫిజిక్స్.
- డిండి కళాశాలలో కెమిస్ట్రీ, కామర్స్, ఇంగ్లిష్, ఫిజిక్స్, తెలుగు.
- నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్.

మహిళా డిగ్రీ కళాశాలలో..

నల్లగొండ రూరల్ : నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ (5), వృక్షశాస్త్రం (1), రాజనీతిశాస్త్రం ఉర్దూ మీడియం (1), చరిత్ర ఉర్దూ మీడియం(1), తెలుగు (5), ఇంగ్లిష్ (1), కామర్స్ (2) భర్తీ చేస్తామని వెల్లడించారు. పీహెచ్‌డీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని.. టీఎస్ సెట్ అభ్యర్థులకు రెండవ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈనెల 20 నుంచి 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని.. 26వ తేదీన కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎన్జీ కళాశాలలో..

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ (3), తెలుగు (3), వాణిజ్యశాస్త్రం (2), బీబీఏ (2), డాటాసైన్స్ (1), మ్యాథ్స్ (1), బయోటెక్నాలజీ (1), కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ (7) స్టాటిస్టిక్స్ (1), టాక్సేషన్ (1) ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. అర్హులని పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 26వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు.

చిరు జల్లులు.. చిగురిస్తున్న ఆశలు

- సీజన్ ఆరంభమై నెలన్నర దాటాక కరుణించిన వరుణుడు
- రెండు రోజులుగా ముసురుతో రైతుల హర్షం
- ఈ వర్షం పత్తి పంటకు ప్రాణం.. నాట్లకు అనుకూలం



త్రిపురారం మండలంలో పొలం పనుల్లో నిమగ్నమైన రైతు

నల్లగొండ అగ్రికల్చర్ : ఉపరితల ఆవర్తనం కారణంగా రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. సీజన్ ఆరంభమై నెలన్నర రోజులు దాటాక వర్షం కురుస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరి నార్లు పోసుకుని నాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్న రైతులు పొలాలను దమ్ము చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల వరినాట్లు వేసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వాతావరణం ఒరుపిస్తే పత్తి చేలలో గుంటకలు తోలుకుని ఎరువులను పెట్టుకోవడానికి రైతులు సమాయాత్తమవుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షం కురిసినప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న ముసురు సాగుకు అనుకూలంగా మారింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంటున్న నేపథ్యంలో జిల్లా అంతటా వ్యవసాయ పనులు ముమ్మరం అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

కురిసేది తక్కువ వర్షమే..

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో అనుకూలమైన వర్షం కురవలేదు. గత జూన్‌లో సాధారణ వర్షం 83.2 మిల్లీమీటర్లుకు గాను 93.1 మిల్లీమీటర్లు కురవగా ప్రస్తుతం 86.3 మిల్లీమీటర్లు కురిసింది. జూలైలో సాధారణ వర్షం 128.1 మిల్లీమీటర్లకు గాను గత సీజన్‌లో 248.1, ప్రస్తుత సీజన్‌లో 50.8 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. దీంతో జిల్లాలో సాగు మందకొడిగా సాగింది. ముందు కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. నార్లు పోసుకుని వరినాట్ల కోసం వర్షం కోసం ఎదురు చూసారు. వర్షాభావంతో పత్తి విత్తనాలు కొన్ని ప్రాంతాల్లో నేలలోనే మాడిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో మొలకలు వాడుపట్టాయి. నెల రోజులుగా రైతులు వర్షాల కోసం వేయి కళ్లతో చేశారు. వాడిపోయిన పత్తి మొలకలు ఒక వైపు వర్షాలు లేకపోవడంతో వరినార్లు ముదిరిపోయి మరోకవైపు ఉండడంతో రైతులు దిగాడు పడ్డారు. ఇప్పుడు కురుస్తున్న వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.



గట్టుప్పల మండలం వెల్మకన్నెలో పత్తి చేను

గత ఏడాదికంటే తక్కువ సాగు..

గత సంవత్సరం వానాకాలం కంటే ప్రస్తుత సీజన్‌లో సాగు తగ్గింది. ఈ వానాకాలం సీజన్‌లో పత్తి 6.50 లక్షల ఎకరాల్లో, వరి 5.25 లక్షల ఎకరాల్లో కంది, పెసర, వేరుశనగ తదితర పంటలు కలిపి మొత్తం 11,54,286 ఎకరాల్లో సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అంచనాలు వేసింది. సకాలంలో వర్షాలు లేని కారణంగా సీజన్ ఆరంభమై 50 రోజులు గడస్తున్నా నేటికీ జిల్లాలో మొత్తం 6,02,133 ఎకరాల్లో మాత్రమే రైతులు పత్తి, వరి, కంది పంటలను సాగు చేశారు. పత్తి 5,38,922 ఎకరాల్లో సాగు చేయగా వరినాట్లు మాత్రం కేవలం 51,525 ఎకరాల్లో మాత్రమే వేసుకున్నారు. గత వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు వరి నాట్లు 86 వేల ఎకరాల్లో వేసుకున్నారు. పత్తి 6లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

వానదేవుడు కాపాడిండు



వానాలు లేక నెల రోజులుగా పత్తిచేలు వాడుపట్టి ఎండిపోయే స్థితికి వచ్చాయి. ప్రస్తుతం వస్తున్న ముసురు వానతో పత్తిచేలు బతికినట్లే. ఒరుపిస్తే గుంటకలు తోలి ఎరువులు పెట్టుకుంటాం. చేను ఎండిపోతుందని బయపడ్డా. వానదేవుడు కాపాడిండు.

– వెంకటయ్య, వెల్మకన్నె, గట్టుప్పల మండలం

12.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు..

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు సగటు వర్షపాతం12.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా మునుగోడు మండలంలో 28.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా.. చిట్యాల 24.4, వేములపల్లి 20.8, చండూరు 19.7, నకిరేకల్ 16.6, కట్టంగూరు 16.5, నార్కట్‌పల్లి 16.3, శాలిగౌరారం 15.7, నల్లగొండ 15.0, మర్రిగూడ 14.5, మాడుగులపల్లి 13.9, తిప్పర్తి 13.8, గుర్రంపోడు 13.2, చింతపల్లి 13.1, మిర్యాలగూడ 12.3, దామరచర్ల 12.3, నాంపల్లి 12.3, గుండపల్లి 11.8, చందంపేట 9.8, కనగల్ 8.6, కేతేపల్లి 8.3, త్రిపురారం 8.0, గట్టుప్పల్ 7.8, నిడమనూరు 7.8, అడవిదేవులపల్లి 7.8, పీఏపల్లి 7.7, అనుముల హాలియా 7.2, తిరుమలగిరిసాగర్ 7.2, దేవరకొండ 6.3, నేరెడుగొమ్ము 5.5, కొండమల్లేపల్లి 5.5, పెద్దవూర మండలంలో 5.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

క్లుప్తంగా

వృద్ధుడు అదృశ్యం


భిక్షం

మునగాల(కోదాడ): మండల పరిధిలోని ఈదుల వాగుతండా గ్రామపంచాయతీ పరిధి మరస కుంటతండాకు చెందిన మూడు భిక్షం నాలుగు రోజుల క్రితం అదృశ్యమైనట్లు అతడి కుమారుడు నాగు బుధవారం తెలిపాడు. భిక్షం ఈ నెల 16న రాత్రి 9గంటల సమయంలో ఇంట్లో ఘర్షణ పడి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని నాగు పేర్కొన్నాడు. రెండు రోజులుగా ఎంత వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. భిక్షం వయస్సు 60ఏళ్లు ఉంటాయని, తెల్లటి పంచె, నల్లగీతల చొక్కా, చేతి సంచితో ఇంట్లో నుంచి వెళ్లాడని, ఆచూకీ తెలిసిన వారు 9542731841కు సమాచారం ఇవ్వాలని నాగు కోరాడు.

మహాలక్ష్మి ఆలయంలో దొంగల చోరీ

కోదాడరూరల్: మండల పరిధిలోని తొగర్రాయి శివారులో గల మహాలక్ష్మి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాలక్ష్మి ఆలయ గర్భగుడి తాళాన్ని పగలగొట్టిన దుండగులు అమ్మవారి రెండు వెండి కిరీటాలు, శఠగోపంతో పాటు రెండు జతల బంగారు పుస్తెలను దొంగలించారు. చోరీకి గురైన ఆభరణాల విలువ సుమారు రూ.95వేలు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేయగా.. ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భూతగాదాలో ఆరుగురిపై కేసు నమోదు


ఘర్షణలో గాయపడిన ఉప్పునూతుల శ్రీశైలం

భూదాన్‌పోచంపల్లి: భూతగాదాలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోచంపల్లి ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం హైదర్‌పూర్ గ్రామశివారులోని సర్వే నంబర్ 84, 85లో గల భూమి విషయంలో మెహర్‌నగర్ గ్రామానికి చెందిన ఉప్పునూతుల చినశ్రీశైలం, కంటి లింగస్వామి మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. కాగా మంగళవారం పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొని భూవివాదాన్ని పరిష్కరించుకొందామని వారిద్దరు సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దిగి కర్రలతో కొట్టుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఇరువరి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం

- ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 5వ తేదీ వరకు గడువు



భువనగిరిటౌన్: ప్రతిఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. దీనిని గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతులు, విద్యావేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులు.. ఇలా ఎవరైనా నూతన ఆవిష్కరణలు చేయొచ్చు. వీటి వివరాలను వాట్సాప్ ద్వారా సంబంధిత అధికారులకు పంపించాల్సి ఉంటుంది. ఉత్తమ ఆవిష్కరణలుగా ఎంపికైన వాటిని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శించనున్నారు.

అన్ని వర్గాల వారికి అవకాశం

సమాజంలో నిత్యం ఎదుర్కొనే సమస్యలను గుర్తించి, పరిష్కరించటమే లక్ష్యంగా సృజనాత్మకంగా ఆలోచించి ఆవిష్కరణలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉన్న వస్తువుల్లో కొన్ని మార్పులు చేసి కొత్తవి కూడా ఆవిష్కరించవచ్చు. ఇవి ఆకట్టుకోవడంతోపాటు, మెప్పు పొందేలా ఉండాలి. రైతులు వ్యవసాయ రంగంలో రకరకాల ప్రయోగాలు చేస్తారు. గృహిణులు ఎన్నో సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. తమ ఆలోచనలు తెలిపి, నూతన ఆవిష్కరణ ప్రదర్శించి బహుమతులు పొందవచ్చు. విద్యార్థులు సైతం నూతన ఆవిష్కరణలు రూపొందించవచ్చు.

ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతి..

ఆవిష్కరణల వివరాలను ఆగస్టు 5వ తేదీలోగా వాట్సాప్ నంబరు 91006 78543కు పంపాల్సి ఉంటుంది. ఆవిష్కరణకు సంబంధించిన వివరణతోపాటు రెండు నిమిషాల నిడివి గల వీడియో పంపించాలి. నాలుగు ఫొటోలు తీసి, నూతన ఆవిష్కర్త పేరు, ఫోన్ నంబరు, వయసు, ప్రస్తుతం చేస్తున్న వృత్తితోపాటు గ్రామం, జిల్లా పేరును పంపించాలి. ఎంపిక చేసిన ఆవిష్కరణలను స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రదర్శిస్తారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలతోపాటు అవార్డులు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి రూ.లక్ష వరకు నగదు బహుమతి ఉంటుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాల నుంచి ఒక ఆవిష్కరణను తప్పనిసరిగా పంపించేందుకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల నుంచి నూతన ఆవిష్కరణల కోసం దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన ఆవిష్కరణలను ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రదర్శిస్తారు. ఆవిష్కర్తలకు సర్టిఫికెట్ల ప్రదానంతో పాటు టీఎస్‌ఐసీ టీం ద్వారా ఉత్తమ ఆవిష్కరణలకు సాంకేతిక సహకారం కూడా అందించడం జరుగుతుంది. మరిన్ని వివరాలకు జిల్లా మేనేజర్ సెల్ నంబర్ 7995016042ను సంప్రదించాలి.

– పమేలా సత్పతి, కలెక్టర్

బోరుబావి బాధితురాలి కాలికి శస్త్రచికిత్స

- ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు కుటుంబ సభ్యుల వెల్లడి
- ఘటన స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మ

బొమ్మలరామారం: మండలంలోని సోలీపేట్ గ్రామంలో మంగళవారం బోరుబావిలో కాలు ఇరుక్కొని 4గంటల పాటు నరకయాతన అనుభవించిన బాధితురాలు ఐనబోయిన పద్మ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆ గ్రామ సర్పంచ్ పూడూరి నవీన్‌గౌడ్ బుధవారం తెలిపారు. జేసీబీ సహాయంతో బోరు బావి కేసింగ్ నుంచి పద్మను బయటకు తీసి మంగళవారం రాత్రి భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. నాలుగు గంటలకు పైగా బోరు బావిలో పద్మ కాలు ఇరుక్కుపోవడంతో ఆమె కాలుకు రక్తప్రసరణ ఆగిపోయి రక్తం గడ్డకట్టుకుపోవడంతో బుధవారం కాలుకు మూడు చోట్ల వైద్యులు శస్త్రచికిత్స చేశారు. గడ్డకట్టుకుపోయిన రక్తాన్ని తొలగించి దాతల రక్తం ఎక్కిస్తున్నట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు..

బోరు బావిలో పద్మ ఇరుక్కుపోయిన స్థలాన్ని తహసీల్దార్ పద్మసుందరి ఆదేశాల మేరకు ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. గత రెండు రోజులుగా ముసురు వర్షం పడుతుండడంతో ఘటన జరిగిన చోటు పూర్తిగా నీటితో మునిగిపోయిందని, బోరు బావిని పూర్తిగా మట్టితో పూడ్చివేయాలని భూమి యజమానికి సూచించినట్లు ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ఆయన వెంట వీఆర్‌ఏ మల్లేష్, గ్రామస్తులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నల్లగొండ క్రైం: పట్టణ సమీపంలోని ఆర్జాలబావి గ్రామ పరిధిలో ఓ ఇంట్లో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని బుధవారం నల్లగొండ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్జాలబావి గ్రామానికి చెందిన మేడిగ శ్రీకాంత్, రాగ్య, నాగరాజు, నర్సింహ, మధు పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వీరు పాత మిల్లును కిరాయికి తీసుకోని పీడీఎస్ బియ్యాన్ని అక్కడ పాలిష్ చేసి ఆర్జాలబావి గ్రామ పరిధిలోని ఓ ఇంట్లో నిల్వ చేశారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి 59 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

రైళ్లపై రాళ్లదాడి కేసులో ఆరుగురి అరెస్ట్


పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ

మిర్యాలగూడ అర్బన్: రైళ్లపై రాళ్లతో దాడి చేసిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్‌ఐ జి.పవన్‌కుమార్‌రెడ్డి బుధవారం మిర్యాలగూడలో విలేకరులకు వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రామన్నపేట-తిప్పర్తి మధ్య రైళ్లపై రాళ్ల దాడి ఘటనలు 8 జరిగాయని, ఈ దాడుల్లో ఆయా రైళ్ల ఏసీ బోగీల కిటికీలు ధ్వంసమయ్యాయని ఆయన తెలిపారు. ఈ దాడుల గురించి దర్యాప్తు చేపట్టి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్టయిన ఆరుగురు విద్యార్థులేనని పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వారికి సుమారు 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

- 250 కేజీల బెల్లం, 5 లీటర్ల సారా, ఒక బైక్ స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్, ఒకరు పరారీ


అరెస్ట్ చేసిన వారిని, ఆటోను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 250 కేజీల బెల్లం, 5 లీటర్ల సారా పట్టుబడింది. ఒక వ్యక్తి పారిపోగా ఇరువురిని అరెస్ట్ చేసి ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం కొత్తతండా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి కొత్తతండాకు బెల్లం, సారాను తరలిస్తున్న ఆటోను తండా శివారులో అదుపులోకి తీసుకున్నారు. ఆటలో ఉన్న 250 కేజీల బెల్లం, 3 లీటర్ల సారాయి స్వాధీనం చేసుకుని వాటిని తరలిస్తున్న బానోతు హుస్సేన్, బాణోతు జాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వాహనానికి పైలెట్‌గా ఉన్న వ్యక్తిని ఆపబోగా అతను తన వాహనాన్ని వదిలి పారిపోయాడు. అతని వాహనం నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఇరువురిని రిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు దివ్య, వెంకన్న, సతీష్‌లు, సిబ్బంది నాగరాజు, రవి, జయరాజ్, ధనుంజయ్, నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లేకుంటే మూసివేత

త్రిపురారం: విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నామని ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. బుధవారం ఎంఈఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 10 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తించి ఇతర పాఠశాలలకు పంపుతున్నామన్నారు. మండలంలోని రాగడప, గుడి తండా, లక్పతి తండా, బుడి తండా, దుర్గా నగర్, మునగబావి గూడెం పాఠశాలలను మూసివేసి ఆయా విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేసినట్లు తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన బొలేరో

- డ్రైవర్ మృతి, మరొకరికి గాయాలు


చెట్టును ఢీకొట్టిన బొలేరో వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: బొలేరో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో డ్రైవర్ మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు సమీపంలో హైదరాబాద్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లికి చెందిన బొంత శ్రీనివాస్(40) నెక్కొండ మండల కేంద్రంలోని మదీనా చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చికెన్ సెంటర్ ఓనర్ చెప్పడంతో శ్రీనివాస్ మరో వ్యక్తి ఇలియాస్‌తో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలోని పౌల్ట్రీఫాంలో కోళ్లను తీసుకుని మహీంద్రా బొలేరో వాహనంలో బుధవారం ఉదయం 5గంటల ప్రాంతంలో వరంగల్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు సమీపంలోకి రాగానే బొలేరో అదుపు తప్పి హైదరాబాద్-వరంగల్ హైవే పక్కన చెట్టుకు బలంగా ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి ఇలియాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇలియాస్‌ను ఆస్పత్రికి తరలించగా, శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు. వేకువజామున డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తొంబై రోజులకు చేరిన రిలే దీక్షలు


దీక్ష చేస్తున్న అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులు

మునుగోడు: మండలంలోని కిష్టాపురంలో ఫార్మా కంపెనీ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 90వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో అఖిలపక్ష నాయకులతో పాటు ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, నందిపాటి వెంకన్న, మునుకుంట్ల మల్లయ్య, ఆకుల లింగస్వామి, యాదయ్య, పరమేష చిన్న వెంకటయ్య, మల్లయ్య, అంజయ్య, గోపాలు, వెంకన్న, మహేష్ పాల్గొన్నారు.

పథకాల కోసం పైరవీలు

- బీసీ ఆర్థిక సాయం, దళిత బంధు, గృహలక్ష్మిపై నేతల సాయం కోరుతున్న ప్రజలు
- రోజూ ఎమ్మెల్యేలు, స్థానిక నాయకుల చుట్టూ ప్రదక్షిణలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పేదలకు ఆర్థిక సహాయం చేసి వారి అభ్యున్నతికి బాసటగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల కోసం కొంత మందికి పైరవీలు తప్పడం లేదు. ఎలాగైనా ఆయా పథకాలు తమకు దక్కేలా చొరవ చూపాలంటూ పరిచయం ఉన్న నేతల సహాయంతో ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటు మండల, నియోజకవర్గ స్థాయి నేతల సహకారంతో అధికారులను కలుస్తూ వారినీ ప్రసన్నం చేసుకొని పథకాలు మంజూరయ్యేలా పావులు కదుపుతున్నారు.

'లక్ష' కోసం వేల దరఖాస్తులు..

బీసీల కోసం ప్రవేశపెట్టిన రూ.లక్ష ఆర్థిక సాయం పథకానికి పోటీ పెరిగింది. జిల్లాలో 23 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే అర్హులను అధికారులు గుర్తించగా ఇంకా ఎంపిక ప్రక్రియ మొదలు కాకున్నా దరఖాస్తుదారులు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని స్థానిక నేతల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు.

రెండో విడత దళితబంధుకు అనుమతి..

జిల్లాలో రెండో విడత దళితబంధుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రతీ నియోజకవర్గం నుంచి 1,100 మందికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరందరికీ రూ.10లక్షల చొప్పున అందించనుంది. సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందడానికి ఈ నిధులు ఇస్తారు. యూనిట్‌కు సంబంధించి శిక్షణ ఇవ్వడంతో పాటు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ.10లక్షలు ఇస్తారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 100 మందికే అవకాశం ఇవ్వడం వల్ల ఎక్కువ మందికి రాలేదు. ఇక రెండో విడత కూడా ఇస్తుండడంతో పోటీ పెరిగింది. ఈ దఫా ఎలాగైనా తమను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని నేతలను దరఖాస్తుదారులు కోరుతున్నారు.

గృహలక్ష్మికి పోటాపోటీ..

రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లకు బదులుగా కొత్తగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి గ్రామాలు, మున్సిపాలిటీల్లో పోటీ పెరిగింది. నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లను ప్రకటించగా ఈ పథకం కింద సొంత జాగా ఉన్న వారికి ఇళ్ల నిర్మాణానికి రూ. 3లక్షలను మూడు విడతల్లో అందివనుంది. దీనికోసం అధికారులతో పాటు నేతలను కలుస్తూ దరఖాస్తులు అందిస్తున్నారు.

కత్తిమీద సాములా ఎంపిక

ఎన్నికల సంవత్సరం కావడంతో కొత్త పథకాలైన బీసీ బంధు, గృహలక్ష్మి, దళితబంధు రెండో విడతపై ప్రజలు దృష్టి పెట్టారు. షెడ్యూల్ వచ్చేలోపే తమకు పథకాలను వర్తింపజేసేలా చూసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఏదో ఒక పథకం తప్పనిసరిగా వచ్చే విధంగా ఎమ్మెల్యేలు, నేతలపై ఒత్తిడి పెంచుతున్నారు. పోటీ తీవ్రంగా ఉండడంతో ఎంపిక ప్రక్రియ ఎమ్మెల్యేలకు కత్తిమీద సాము కానుంది. మూడు నెలల్లో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండటంతో అర్హులైన వారిని ఎంపిక చేయకుంటే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. దీంతో తమ అనుచరుల ద్వారా గ్రామాల వారీగా వివరాలను తెలుసుకుంటున్నారు.

పాఠశాలల్లో మళ్లీ తొలిమెట్టు

- రేపటి నుంచి 150 మంది ఆర్పీలకు శిక్షణ
- 26 నుంచి మండలాల్లో ఉపాధ్యాయులకు..
- ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన విద్యాశాఖ


తిరుమలగిరిలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యా శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గత సంవత్సరం తొలి మెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక పాఠశాలల్లో కార్యక్రమాన్ని అమలు చేయగా అభ్యసన సామర్థ్యాలు కాస్త మెరుగయ్యాయి. ఈ సారి కూడా ఈ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది.

రాష్ట్ర స్థాయి రిసోర్స్‌పర్సన్‌లకు శిక్షణ పూర్తి

రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన ఆర్పీలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఉన్నత తరగతుల్లో విద్యార్థుల్లోనూ కనీస సామర్థ్యాలు, భాషా పరిజ్ఞానం కోసం లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్)కు శ్రీకారం చుట్టనున్నారు. ఆగస్టు నుంచి పకడ్బందీగా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో తొలి మెట్టు విజయవంతం కావడంతో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమలు చేయాలని నిర్ణయించారు.

కార్యాచరణ ఇలా..

తొలి మెట్టు అమలులో భాగంగా ప్రస్తుతం జిల్లాలోని పాఠశాలల్లో రెండు నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఫేస్ లైన్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు సూచించారు. దీంతో గత ఏడాది ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన నమూనా ప్రశ్నా పత్రాలతో ఈ పరీక్షలు పెట్టారు. కొన్ని పాఠశాలల్లో ఇంకా నిర్వహించాల్సి ఉంది. దీని వల్ల పాఠశాలల్లోని విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి ఏ మేరకు తరగతుల వారీగా ఫలితాలు సాధించాలనేది ఉపాధ్యాయులకు అవగతమైంది. ఆయా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని పీరియడ్, వార, సంవత్సరం వారీగా బోధనాభ్యసన ప్రణాళికలను వారు రూపొందిస్తున్నారు.

ముందుగా ఆర్పీలకు..

తొలి మెట్టు కార్యక్రమం అమలులో భాగంగా గత ఏడాది మాదిరిగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపికైన పది మంది జిల్లా స్థాయి ఆర్పీ (రిసోర్స్ పర్సన్)లకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శిక్షణ ఇచ్చారు. మండల స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఆరుగురు ఆర్పీలను ఎంపిక చేస్తారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 23 మండలాలకు కలిపి 138 మంది, ఉర్దూ మీడియం 12 మంది ఇలా మొత్తం 150 మందికి ఈ నెల 21 నుంచి 24 వరకు సూర్యాపేటలో శిక్షణ ఇస్తారు. జిల్లా స్థాయి శిక్షణ అనంతరం మండల స్థాయిలో మూడు దశల్లో శిక్షణ ప్రారంభమవుతుంది. తెలుగు, ఇంగ్లిష్, గణితం ఉపాధ్యాయులకు ఈ నెల 26 నుంచి ఆగస్టు 2 వరకు శిక్షణ కొనసాగనుంది. సబ్జెక్టుకు రెండు రోజుల చొప్పున శిక్షణ ఇస్తారు.

గత ఏడాది స్ఫూర్తితోనే



విద్యా సామర్థ్యాల పెంపు కోసం ప్రభుత్వం తొలి మెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడ్డాయి. ఇదే స్ఫూర్తితో ఈసారి కూడా అమలు చేస్తున్నాం. ఈ నెల 21 నుంచి ఆర్పీలకు శిక్షణ ఇస్తున్నాం.

– జనార్దన్, సెక్టోరియల్ అధికారి, సూర్యాపేట.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నిడమనూరు: అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు. కనగల్ మండలం ఎస్. లింగోటంకు చెందిన ఐదు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రైవర్లు కన్నెబోయిన రవి, కన్నెబోయిన కొండల్, కన్నెబోయిన రాంబాబు, కన్నెబోయిన పెద్దలింగయ్య, వజ్జె శంకర్‌ల(వెంకాపురం)పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

● 'సదరం' కోసం పాట్లు



నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సదరం క్యాంపులో వినికిడి లోపం ఉన్నవారు బుధవారం అత్యధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఆస్పత్రి పరిసరాల్లో పలువురు దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ